

21న జడ్పీ సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సభ్యులందరూ పాల్గొనాలని తెలిపారు. జిల్లాలోని వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.





అధ్యక్షా..

సిక్కోలు సమస్యలు ఇవే!

- నదుల అనుసంధానం వేగవంతం చేయాలి
- సాగు నీటి ప్రాజెక్టులు ఆధునికీకరించాలి
- 'జల్‌జీవన్ మిషన్' వేగవంతం లేదాయె
- నిధులు మంజూరు చేస్తేనే ఫలితం
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్న జిల్లా ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాగా పేరొందిన శ్రీకాకుళాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా చేయాల్సిన బాధ్యత జిల్లా శాసన సభ్యులపై ఉంది. జిల్లా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం, నిధులు మంజూర య్యేలా చూడాల్సిన అవసరం ఉంది. గురువారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. వీటిని జిల్లా ఎమ్మెల్యేలు సద్విని యోగం చేసుకుని, తమ గళం వినిపించి అభివృద్ధి, ఉపాధి, రహదారులు, మౌలిక వసతులు కల్పనకు సాధ్యమైనన్ని నిధులు తీసుకువస్తారని ప్రజలు గంపెడాశతో ఉన్నారు.

ఇవీ సమస్యలు..

2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపుదాల్చిన నాగావళి-వంశధార నదుల అనుసంధానం ప్రక్రియను.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఇప్పటికైనా నదుల అనుసంధానాన్ని వేగవంతం చేయాలి. గొట్టా బ్యారేజీ.. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం, వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువ తదితర సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు కోట్లాది రూపాయల నిధుల అవసరముంది. కాలువలు సక్రమంగా లేకపోవడం.. పూర్తిస్థాయిలో పూడిక తీత చేపట్టకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. తాగునీటికి సంబంధించి జల్‌జీవన్ మిషన్ పనులు నత్తనడకనగా సాగుతున్నాయి. ఈ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీ పథకం నుంచి ఏప్రిల్ తర్వాత కొత్తగా నిధులు మంజూరుకాలేదు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు అసలు జరగుతున్నాయో లేదో కూడా తెలియడం లేదు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలి. శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ఎన్నికలు దశాబ్దం నుంచి లేవాయె. అభివృద్ధి కూడా అంతేసంగతి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా శ్రీకాకుళం జిల్లాలో కస్తూర్బా, ఎంజేపీ, సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనంతో కూరగాయలు, ఇతరత్రా పోషకాహారం సమకూర్చేందుకుగాను సాధ్యంకాని ధరలను కాంట్రాక్టర్లకు అధికారులు కట్టబెట్టారు. వసతి గృహాల్లో 'మెనూ' అంటేనే (మిగతా 6వ పేజీలో..)

అన్ని విషయాలపై స్పందిస్తా



రాష్ట్ర మంత్రిగా అన్ని విషయాలపై స్పందిస్తా. ఇటు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలతోపాటు సభ్యులు లేవనెత్తే ప్రతి అంశానికి బదులిస్తా. శాఖాపరంగా నేను తీసుకోవాల్సిన చర్యలపై వెంటనే ఉపక్రమిస్తాను.

- కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి



సంప్రదాయ వలలకు చేపలు చిక్కట్లే



సంప్రదాయ వలలతో చేపల వేట చేస్తున్న నువ్వలరేవు మత్స్యకారులు

- మరబోట్ల ధాటికి సంద్రం లోపలకు..
- నష్టపోతున్న సంప్రదాయ మత్స్యకారులు
- వలసబాట పడుతున్న వైనం



వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రింగువల, పెద్దవల, నారవల, జోగాలవల, తెప్ప, పడవ ఈ పేర్లు ఒకప్పుడు మత్స్యకార గ్రామాల్లో వినిపించేవి. ఇందులో పెద్దవల, రింగువల ఉన్న మత్స్యకారుడు గ్రామపెద్ద. ఎందుకంటే ఈ వలలకు అధిక మొత్తంలో చేపలు చిక్కడంతో ఆదాయం మస్తుగా ఉండేది. దీన్ని తోటి మత్యకారులందరికీ సమానంగా పంచిపెట్టేవాడు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. మరబోట్ల ధాటికి సంప్రదాయ వలలకు చేపలు చిక్కడం లేదు. దీంతో ఈ వలలపై ఆధాపడే మత్స్యకారులు చేపలవేటను వీడి ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారు. అక్కడ వలలు అల్లుకొని జీవనం సాగిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 11 మండలాల పరిధిలో 193 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 1,12,500 మంది మత్స్యకార జనాభా ఉన్నారు. వీరిలో 16 వేల మంది మత్స్యకారులు మోటరైజ్డ్, సంప్రదాయ పడవల్లో వేట సాగిస్తున్నారు. అయితే కాకినాడ, విశాఖపట్నం నుంచి కొందరు మత్స్యకారులు మరబోట్లతో జిల్లా తీరంలోకి (మిగతా 6వ పేజీలో..)

ఉపాధి అవకాశాలు పెంపొందించాలి



మత్స్యకార గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. సంప్రదాయ వలలకు చేపలు చిక్కకపోవడంతో చాలామంది మత్స్యకారులు వలస పోతున్నారు. నువ్వలరేవు గ్రామం నుంచి గోవా, ముంబాయి వంటి ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. మరబోట్ల కారణంగా సంప్రదాయ వలలకు చేపలు చిక్కకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

-పూర్ణ, సర్పంచ్, నువ్వలరేవు

మరబోట్లను అరికట్టాలి



మరబోట్లు తీరానికి వచ్చి చేపల వేట చేస్తుండడంతో సంప్రదాయ మత్స్యకారులు నష్టపోతున్నారు. ఐదు కిలో మీటర్ల లోపలే మరబోట్లతో చేపల వేట సాగించాలనే నిబంధన ఉన్నా పట్టించుకోడం లేదు. గతంలో అనేకసార్లు మరబోట్ల మత్స్యకారులతో గొడవలు పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా వాటిని అరికట్టాలి.

-వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, నువ్వలరేవు

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ముందుకు రావట్లే



పలాస-కాశీబుగ్గ జంటపట్టణంలో ఓ అనధికార లేఅవుట్

- ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోని యజమానులు
- భారీగా జరిమానా చెల్లించాల్సి వస్తుందని వెనకడుగు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలాస, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)ను ప్రవేశపెట్టింది. జీవో నెంబర్ 134 ప్రకారం ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత భూములను క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఇచ్చింది. అయితే, ఎల్ఆర్ఎస్ ద్వారా అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవడానికి సంబంధిత యజమానులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వానికి భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుందన్న అనుమానంతో వెనకడుగు వేస్తున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా వారు ఆసక్తి కనపరచడం లేదు. జిల్లాలో పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మునిసిపాలిటీలతో పాటు శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఉంది. వీటి పరిధిలో మొత్తం 120కు పైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వీటిద్వారా రూ.50 కోట్లకు పైగా ఆదాయం వస్తుందనే ఆశతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. అయితే, ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోవడానికి అక్రమ లేఅవుట్ల యజమానులు ముందుకురాకపోవడంతో జోనల్ కార్యాలయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో ఈ బాధ్యతలను టౌన్‌ప్లానింగ్ అధికారులకు అప్పగించారు. పర్యవేక్షులుగా మున్సిపల్ కమిషనర్లను నియమించారు. ప్రస్తుతం అన్ని లేఅవుట్ల వద్దకు అధికారులు వెళ్లి కొలతలు వేయడంతో పాటు ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో..)

వినియోగించుకోండి



ఎల్ఆర్ఎస్‌ను ప్రతి అక్రమ లేఅవుటుదారుడూ వినియోగించుకోవాలి. అదనపు చార్జీలు లేకుండా క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. పలాస-కాశీబుగ్గలో 22 లేఅవుట్లు గుర్తించాం. మొత్తం అన్నీ వీటి పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సంబంధిత యజమానులతో మాట్లాడుతున్నారు.

-ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

ఆంధ్ర యువ 2కే మారథాన్

- రెండు నిమిషాల వీడియో తయారు చేయాలి
- విజేతలకు బహుమతులు అందిస్తాం
- సెట్‌శ్రీ సీఈవో అప్పలనాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువతను భాగస్వాములను చేస్తూ ఆంధ్ర యువ 2కే 25 అంబాసిడర్ డిజిటల్ మారథాన్ కార్యక్రమాన్ని ఈ నెల 30వరకు నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ బాంధవ్యాలు, ఆరోగ్యకర జీవన విధానాలు, బాధ్యయుత డిజిటల్ ఆవిష్కరణలు వంటి అంశాలను ప్రోత్సహించేందుకు ఈవెంట్లు, థీమ్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల యువత www.andhrayuvasankalp.comలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 120 సెకన్ల నిడివి గల వీడియో లేదా షార్ట్ తయారుచేసి, తమ సోషల్ మీడియా ఖాతాల్లో (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్) అధికారిక హ్యాష్ ట్యాగ్‌లతో పోస్టు చేయాలన్నారు. ఎంపికైన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75వేలు, మూడో బహుమతి రూ.50వేలు ఇస్తామన్నారు. అలాగే 9మంది విజేతలకు ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25 గుర్తింపు లభిస్తుందని అన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బీటెక్, ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఎచ్చెర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల 6వ సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. బీటెక్‌లోని ఐదు బ్రాంచ్‌లు కలుపుకొని ఆరో సెమిస్టర్‌కు 289 మంది హాజరు కాగా, 270 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో పదో సెమిస్టర్‌కు 26 మంది హాజరుకాగా 24 మంది, మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ఆరో సెమిస్టర్‌కు 96 మంది హాజరుకాగా 92 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాల జ్ఞానభూమి, వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. పరీక్షల ఫలితాలపై ఎలాంటి సందేహాలున్నా 15 రోజుల్లో పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

డిగ్రీ తరగతులు ప్రారంభమెప్పుడో?

- ఇంకా కేటాయించని ప్రథమ సంవత్సర సీట్లు
- ఇప్పటికే నాలుగు నెలల జాప్యం
- ఆందోళనలో విద్యార్థులు



పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల



పాతపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తుంది. ఇప్పటికీ డిగ్రీ ప్రథమ సంవత్సర తరగతులు మొదలుకాలేదు. ఇంకా సీట్ల కేటాయింపు ప్రక్రియ కొలిక్కి రాలేదు. డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వం జీవో జారీ చేసి రెండునెలలు కావస్తున్నా నేటికీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆసక్తిగల అభ్యర్థులు డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు చేస్తున్నారు. వారికి సీట్ల కేటాయించకుండా రేపు మాపు అంటూ తేదీలు మారుస్తుండడంపై విద్యార్థులు వారి తల్లిదండ్రుల అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 17 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 99 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి సుమారు 3,500మంది వరకూ విద్యార్థులు ప్రవేశించాల్సి ఉంది. వారంతా దరఖాస్తులైతే చేశారు గానీ సీట్ల కేటాయింపు కొలిక్కి రాకపోడంతో ప్రవేశాలపై డోలాయమాన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రవేశాలు ఆలస్యం జరుగుతుండడంతో ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో జాయిన్ చేసేందుకు విద్యార్థులను ప్రైవేటు కళాశాలలు ఎగరేసుకుపోతున్నాయి.

వరుస వాయిదాలు

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి అనుసరించాల్సిన విధివిధానాలు, కోర్సులు తదితర అంశాలపై ప్రభుత్వం వివిధ వర్గాల ప్రతినిధులు, విద్యావేత్తలతో చర్చలు జరిపి తుదినిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించాలంటూ ఈ ఏడాది జూలై 15న జీవో జారీచేసింది. తదుపరి అడ్మిషన్ షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉండగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీవ్ర జాప్యం చేసింది. వాస్తవానికి ప్రభుత్వం జీవో జారీ చేసిన వారం రోజుల వ్యవధిలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా, ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టర్‌ను సిద్ధం చేయలేదు. ఎట్టకేలకు 35రోజుల తదుపరి అడ్మిషన్ ప్రక్రియ షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. ఆగస్టు 20న ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. చివరి తేదీగా ఆగస్టు 26 అని తొలుత అధికారులు ప్రకటించారు. దీనిప్రకారం సీట్ల అలాట్‌మెంట్ పూర్తిచేసి, సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుల ఆన్‌లైన్‌కు ఇబ్బందులు ఎదురవడంతో, రెండు విడతలుగా దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 4వరకూ పొడిగించారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణ పూర్తిచేసి స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల వెరిఫికేషన్ కోర్సుల ఆప్షన్ నమోదు పూర్తయింది. ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి ఈనెల 6 నుంచి విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేస్తామని ముందుగా ప్రకటించారు. చివరిక్షణంలో 8వ తేదీ అని, మళ్లీ 10వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు చెప్పారు. కానీ, ఇప్పటికీ ఆ ప్రక్రియ చేపట్టలేదు. సమాచారం లేకుండా ఎప్పటికప్పుడు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. అసలు సీట్ల కేటాయింపు ఎప్పుడు పూర్తవుతుందో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా, కొన్ని ప్రైవేట్ కళాశాలలు అనధికారికంగా డిగ్రీ ప్రథమ సంవత్సర తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

సాహసాల సూర్యుడు
- చేతివేళ్లపై కార్లను నడిపించుకుంటాడు
- దంతాలతో ఇనుమును వంచేస్తాడు
6లో

ఘనంగా విశ్వకర్మ జయంతి
6లో



మీ అభివృద్ధికి ఏమి చేయాలో చెప్పండి
- ఆదికర్మయోగి కేంద్ర పరిశీలకుడు రాహుల్ కురాన్
6లో

సిబ్బంది లేక.. శస్త్రచికిత్సలు జరగక
- టెక్కలి, శ్రీకాకుళం రిఫర్ చేస్తున్న వైనం
- ఇదీ పాతపట్నం సీహెచ్‌సీలో పరిస్థితి
8లో

అధ్యక్షా.. సిక్కోలు సమస్యలు ఇవే!

(ఐదో పేజీ తరువాయి)

అంతేలే.. అన్న రీతిలో అధికారులే అనుమానంగా ఉన్నారు. నేరుగా హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా అంతటి తక్కువ ధరకు లభించని.. ధరలను కాంట్రాక్టరు వేయడం.. అధికారులు కూడా గుడ్డిగా అప్పగించడం జరిగింది. దీంతో వసతి గృహాల్లో పౌష్టికాహారం రికార్డుల్లో నూరుశాతం అమలై.. క్షేత్రస్థాయిలో అంతేసంగతిగా మారింది. దీనిపైనా చర్చించి వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా, కారకులపై చర్యలు తీసుకునేలా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అవసరం ఉంది.

రుణాల సమస్యను ప్రస్తావిస్తా..



బీసీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వారికి రుణాలు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. వంశధార నీరు శివారు భూములకు అందడంలేదు. రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా.. కాలువలకు షట్టర్లను ఏర్పాటు చేయాల్సిఉంది. ఈ విషయంపై చర్చిస్తాను. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉంది. గిరిజనులు అధికంగా మా నియోజకవర్గంలో ఉన్నారు. జిల్లాలో ఎక్కడైనా 'ఐటీడీఏ'ను ఏర్పాటు చేయాలి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది నియమించాలి. ఇవన్నీ సభలో ప్రస్తావిస్తా.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

అవసరమైన నిధులు తీసుకువస్తా..



మా నియోజకవర్గ ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు అవసరమైన సహకారం కోసం సభలో ప్రస్తావిస్తాను. ఇండస్ట్రియల్ పార్కును శంకుస్థాపన చేశాం. కానీ పరిశ్రమలు ఒక్కటీ ఏర్పాటు కాలేదు. ఎల్.ఎన్.పేట మండలంలో పోలీసు స్టేషన్ లేక పోవడంతో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడ పోలీసు స్టేషన్ అవసరం ఉంది. గొట్టాబ్యారేజీ యాప్రాను(రాతికట్ట) పాడైంది. ఇందుకోసం రూ.18 కోట్లు వెచ్చిస్తే ప్రాజెక్టుకు బలం చేకూరుతుంది. వీటన్నింటిపైనా ప్రస్తావించి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తా.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

ఉద్యోగుల సమస్యలు తెలియజేస్తా..



ఈ దఫా సమావేశాల్లో చాలా విషయాలు ప్రస్తావిస్తా. ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి నదులు అనుసంధానం పూర్తిచేయాలి. వంశధార, నాగావళి కరకట్టల నిర్మాణం చేపట్టాలి. ఎత్తిపోతల పథకాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటికి నిధులు అవసరముంది. జల్‌జీవన్ మిషన్ పనులు సరిగ్గా జరగట్లేదు. గత ప్రభుత్వం అమ్మేసిన గ్రూప్-1 ఉద్యోగుల విషయమై అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పీఆర్సీ వంటి విషయాలను ప్రస్తావిస్తాను.

-కూన రవికుమార్, పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

రైతుల ఇబ్బందులను ప్రస్తావిస్తా..



వంశధార ఎడమ ప్రధాన కాలువలో 2300 క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సిఉంది. కానీ 1400 క్యూసెక్కుల నీరు దాటితే కాలువకు గండి పడిపోతుంది. కాలువను ఆధునీకీకరించాల్సిందే. సాగునీటి కోసం రైతుల ఇబ్బందులను ప్రస్తావిస్తాను. వనితమండలం వంతెన పనులను గత ప్రభుత్వం పక్కనబెట్టేసింది. మరలా ఇప్పుడు సాంకేతిక పరంగా అనుమతులు ఇచ్చి.. వంతెనను పూర్తిచేయాలి. సారవకోట మండలంలో మరో ఉద్దానం మాదిరిగా కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడకు సురక్షితమైన తాగునీటిని ప్రాజెక్ట ద్వారా అందించే పథకాన్ని మంజూరుచేయాలి. జల్‌జీవన్ మిషన్ పనులు అంతగా నిర్వహించలేదు. ఈ సమస్యలన్నింటినీ ప్రస్తావిస్తాను.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతా..



ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధిక పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ స్థానికులకు కూడా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాన్ని కోరుతా. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తాను. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టులను ఆధునీకీకరించాలి. బుడగట్లపాలెం హార్బర్ పనులు కొనసాగేలా సీఎంను కోరుతా. గత ప్రభుత్వంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. వారికి ఇప్పుడు ఇళ్ల స్థలం కేటాయించి.. ఇళ్లను నిర్మించి ఇచ్చేలా ప్రస్తావిస్తా. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం పనులు ప్రారంభించాలని, యువతకు ఉపాధి కోసం స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పాలని కోరుతా.

-నడుకుదిటి ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

మైనర్ ఇరిగేషన్ కోసం మాట్లాడుతా..



ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న సాగునీటి వనరులన్నీ మైనర్ ఇరిగేషన్‌కు చెందినవే. వాటి నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని కోరుతా. ఇప్పుడు నేను ప్రభుత్వ విప్‌గా ఉండటంతో అన్ని విషయాల్లో ఆచితూచి స్పందించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గం వచ్చినప్పుడు కొన్ని హామీలు ఇచ్చారు. వాటిని నెరవేర్చాలని కోరుతాను. ఆటో, ట్రాక్టర్ వాహనాల సామర్థ్యం పరీక్షించేందుకు జిల్లా కేంద్రానికి వాహనం తీసుకుని వాహనదారులు వెళ్లాల్సివస్తుంది. నియోజకవర్గ కేంద్రంలో వాహన సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్ష నిర్వహించాలని ప్రస్తావిస్తాను. బెంతుఒరియాల విషయాన్ని మరలా ప్రస్తావిస్తాను.

-బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

సమస్యల పరిష్కారం కోసం యత్నిస్తాను..



శ్రీకాకుళం నగర పాలక సంస్థకు ఎన్నికల నిర్వహించే ముందరే వార్డుల పునర్విభజన జరగాలి. ఈ విషయమై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. శ్రీకాకుళం నియోజకవర్గంలో వంశధార కుడిప్రధాన కాలువ పరిధి 37 ఉపకాలువ నుంచి శివారు భూములకు సాగునీరు అందడంలేదు. ఈ విషయమై ప్రశ్నించేందుకు ఇప్పటికే సమాయత్తమయ్యాను. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దేందుకు.. తాగునీటి వ్యవస్థను సరిచేసేందుకు.. ట్రాఫిక్ రెగ్యులైజేషన్ చేసేందుకుగాను నిధులు మంజూరుచేయాల్సిఉంది. వీటిపై సమగ్రంగా చర్చిస్తాను. ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు నిధులు అవసరం. సింగుపురంలో జూనియర్ కళాశాల నిర్మాణం చేయాలి. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాలను త్వరితగతిన పూర్తిచేయాలి. కేఆర్ స్టేడియం, ఆమదాలవలస రోడ్డు పూర్తిచేయాలి. ఇలా అన్ని విషయాలపై అసెంబ్లీలో చర్చించి.. సమస్యల పరిష్కారం కోసం యత్నిస్తాను.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

సాహసాల సూర్యుడు



దంతాలతో ఇనుమును వంచుతున్న సూర్య

మన చేయిపై పొరపాటున ఏదైనా బరువైన వస్తువు పడితేనే తట్టుకోలేక విలవిల్లాడిపోతాం. ఓ కర్ర ముక్కను గట్టిగా కొరకాలంటేనే భయపడతాం. కానీ ఆ కుర్రాడు ఒకేసారి ఇరవై కార్లను తన చేతులపై పోనిస్తాడు. ఇనుప రాడ్డును దంతాలతో అలవోకగా వంచేస్తాడు. ఆ కుర్రాడి పేరు డొక్కరి సూర్య. సోంపేట మండలం రాజాం గ్రామ నివాసి.

- చేతివేళ్లపై కార్లను నడిపించుకుంటాడు
- దంతాలతో ఇనుమును వంచేస్తాడు

సోంపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

కథానాయికతో పందెం వేసి... కథానాయకుడు పవన్‌కల్యాణ్ ఓ సినిమాలో కార్లను తన చేతుల పైనుంచి నడిపించుకుంటాడు. అచ్చం అలానే తన చేతుల మీదుగా కార్లను నడిపించుకుంటూ అబ్బుర పరుస్తున్నాడు రాజాం గ్రామానికి చెందిన డొక్కరి సూర్య(24). అది కూడా ఒకటో రెండో కాదు.. ఒకేసారి వరుసగా 20 కార్లను చేతివేళ్లపై నడిపించుకుంటాడు. ఇనుప రాడ్డును దంతాలతో ఇట్టే వంచేస్తాడు. చేతితో పచ్చి కొబ్బరికాయలను వలిచేస్తాడు. చేతితో ఇటుకలు పగులగొడతాడు. 80 కిలోల బరువును సునాయాసంగా ఎత్తేస్తూ... చూపరులను ఆశ్చర్యంలో ముంచేస్తాడు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని దీనికోసం తాను ఐదేళ్లుగా సాధన చేస్తున్నానని చెబుతున్నాడు సూర్య.



చేతివేళ్లపై కార్లు వెళుతున్న దృశ్యం

చిన్నతనంలో తల్లిదండ్రులు దూరం..

సూర్య ఆరేళ్ల వయస్సులో ఉన్నప్పుడే తల్లిదండ్రులు మృతి చెందారు. దీంతో అమ్మమ్మ, తాతయ్యల దగ్గర పెరిగాడు. గ్రామస్థుల ఆర్థిక సాయంతో ఇంటర్ వరకూ చదివాడు. ప్రస్తుతం తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన పూరింట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నాడు. యూట్యూబ్‌లో కొంతమంది సాహసాలను చూసి తాను కూడా వీటిని నేర్చుకుంటున్నట్టు చెబుతున్నాడు. నిత్యం సాధన చేస్తుంటానని అంటున్నాడు. కూలి పనుల ద్వారా వచ్చే ఆదాయంతోనే సూర్య బతుకుబండి లాగిస్తున్నాడు. ఈ పనుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంతమొత్తం ఓ చోట ఉంచి... ప్రతినెలా అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి... అక్కడ ఉన్న వారికి సాయం చేస్తుంటాడని గ్రామస్థులు చెబుతున్నారు. తాను అమితంగా అభిమానించే నటుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిలో పడాలని ఈ విన్యాసాలు మొదలుపెట్టానని... ఆయనను కలవాలనేది తన చిరకాల వాంఛ అని అంటున్నాడు సూర్య.



వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

- ముంపులోని పొలాలను పరిశీలించిన రాగోలు వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు



చిక్కావలస- మామిడివలస గ్రామాల మధ్య వరదనీటి నుంచి తేరుకున్న పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వరద ముంపునకు గురైన వరి పంట పొలాల్లో తెగుళ్ల ఆశించే ప్రభావం అధికంగా ఉంటుందని, దీంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రాగోలు వరిపరిశోధన సంస్థ, కేవీకే శాస్త్రవేత్తలు ఉదయబాబు, ఎస్.కిరణ్‌కుమార్, రాయ్ సూచించారు. బుధవారం చిక్కావలస పంచాయతీలోని మామిడివలసలో ఇటీవల వరద నీటిలో చిక్కుకొని తెరుకున్న వరి పంట పొలాలను పరిశీలించారు. నరసన్నపేట వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ ఎల్‌వీ మధు, ఏవో సూర్యకుమారి పాల్గొన్నారు.

అకేసు చెట్లు నరికి.. అక్రమ రవాణా చేసి

- గోపాలపెంటలో స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపెంట వద్ద లారీలో అక్రమంగా అకేసు కలపను తరలిస్తుండగా బుధవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నదీ తీర ప్రాంతాల్లో గల అకేసు చెట్లు కొందరు నరికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో టెక్కలి రేంజర్ జగదీష్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు గోపాలపెంట నుంచి ఎచ్చెర్ల వద్ద లోడింగ్ పాయింట్‌కు తరలిస్తుండగా లారీ సీజ్ చేసి తామరాపల్లిలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప విలువను మదింపు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని జగదీష్ తెలిపారు. వారి ఆదేశాల మేరకు అపరాధ రుసముతో పాటు సీపీజును వసూళ్ల చేస్తామని చెప్పారు.



కలప స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ముందుకు రావట్లే!

(ఐదో పేజీ తరువాయి)

కల్పిస్తున్న రాయితీలు, లాభాలపై సంబంధిత యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. కొద్ది రోజులే సంబంధిత వెబ్‌సైట్ నిర్వహిస్తుండడంతో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నారు.

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మొత్తం 22 అనధికార లేఅవుట్లు ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరించడం వల్ల మున్సిపాలిటీకి రూ.6 కోట్ల మేర ఆదాయం రానుంది. కానీ, ఇప్పటి వరకూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఇప్పటికే సంబంధిత లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం కూడా జరిగిపోయినట్లు అధికారులు గుర్తించారు. అందరికి ముందుగా నోటీసులు అందించి ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి రావాలని అధికారులు కోరుతున్నారు. 2025 జూన్ 30 లోపు స్థలానికి సేల్‌డీడ్ ఉండా లి. నియమాలు వచ్చిన 90 రోజుల్లోగా ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో సంబంధిత డాక్యుమెంట్లతో వివరాలు నమోదు చేసుకుంటే ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి సంబంధిత లేఅవుట్ల వస్తాయి. అందులో నిర్మాణం చేసిన భవనాలకు అనుమతులు సులభంగా వస్తాయి. దీంతో పాటుగా నిబంధనల ప్రకారం గడువులోగా దరఖాస్తు చేసుకుంటే 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జిలతో 50 శాతం రాయతీ వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. క్రమబద్ధీకరించుకోపోతే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరు. దీంతో పాటుగా విద్యుత్, మంచినీటి సరఫరా, రోడ్లు, కాలువల నిర్మాణాలు కూడా చేపట్టరు. బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తాయి.

సంప్రదాయ వలలకు చిక్కని చేపలు

(ఐదో పేజీ తరువాయి)

ప్రవేశించి వేట సాగిస్తున్నారు. 8 నాటికల్ మైళ్ల లోపలే వారు చేపల వేట చేయాలనే నిబంధన ఉంది. కానీ, నిబంధనలు అతిక్రమించి ముందుకు వచ్చి వారు చేపలవేట చేస్తుండడంతో సంప్రదాయ మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరబోట్ల ధాటికి చేపలన్నీ సముద్రంలోకి వెళ్లిపోతుండడంతో సంప్రదాయ వలలకు చేపలు చిక్కడం లేదు. ప్రతిఏటా సెప్టెంబరు ప్రారంభంలోనే టైగర్ రొయ్యలు సంప్రదాయ వలలకు దొరికేవని.. కానీ, ఈ ఏడాది ఇంతవరకు వలకు అవి చిక్కడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. దీంతో ఈ వలలపై ఆధారపడే మత్స్యకారులు కుటుంబాలను విడిచి వలసబాట పడుతున్నారు. ఒక్క నువ్వలరేవు గ్రామంలోనే సగం మందివరకు వలస వెళ్లారని గ్రామస్థులు చెబుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని 11 పంచాయతీల్లో ఈ పరిస్థితి ఉందని మత్స్యకార నాయకులు అంటున్నారు. మరబోట్లను నియంత్రించాలని గతంలో అనేకసార్లు పోరాటాలు చేసినా ఫలితం లేదని ఆవేదన చెందుతున్నారు. కనీసం ఉపాధి పథకం ద్వారా పనులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా మరబోట్ల పరిధిని నిర్ణయించి, వాటిని నియంత్రించాలని కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



జి.టి.రోడ్డులో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరానికి విశ్వకర్మ గొప్పదనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ బి.పద్మావతి, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకులు ఎస్.ధనుంజయరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): చంపాగల్లివీధిలో విశ్వకర్మ పంచమ పూజ మహోత్సవాలు బుధవారం ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్టుకు పూజలు చేశారు. అనంత రం స్థానిక ముత్యాలమ్మ గుడి నుంచి పాత బస్టాండ్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. జి.టి.రోడ్డులోని ఖాళీస్థలంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్షులు సోపింటి తారకేశ్వర రావు, కార్యదర్శి కడారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు అదనపు ఎస్పీ కె.వి.రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అదనపు ఎస్పీ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం పరిపాలనాధికారి సి.హెచ్.గోపీనాథ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత..

జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 17: ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వస్తుందని ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోటలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ పూజల్లో లక్కోజు శ్రీనివాసరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, నాయకులు ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



సారవకోట: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



విశ్వకర్మ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ, ఎమ్మెల్యే తదితరులు

మీ అభివృద్ధికి ఏమి చేయాలో చెప్పండి

- ఆదికర్మ యోగి కేంద్ర పరిశీలకుడు రాహుల్ కురాన్

మెళియాపుట్టి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మీరు అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి రావాలంటే ప్రభుత్వాలు ఏమిచేయాలో చెప్పండి' అని ఆదికర్మ యోగి కేంద్రపరిశీలకుడు రాహుల్‌కూరాన్ కోరారు. బుధవారం బందపల్లిలో ఆదికర్మ యోగి గ్రామసభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి నిధులు మంజూరుచేస్తామని చెప్పారు. ఆదివాసీ కేంద్ర పోర్టర్ ఆన్‌లైన్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ఏపీవో చిన్నాబాబు మాట్లాడుతూ జిల్లాలోని మొదటి విడతలో 34 గిరిజన గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు చెప్పారు. అక్టోబరు రెండో తేదీన గ్రామసభల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూవో భాస్కరరావు, తహసీల్దార్ పి.పాపరావు, ఈవోపీఆర్డీ తారకేశ్వరి, ఏఈవో ప్రభవతి, ఏపీవో రవి, నారాయణ, సూర్యనారాయణ, టీడీపీ గిరిజన రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దినకరరావు పాల్గొన్నారు.



ఆదికర్మ యోగి గ్రామసభలో గిరిజనుల సమస్యలు అడిగితెలుకుంటున్న రాహుల్‌కురాన్

నేటి నుంచి గ్రామదేవత ఉత్సవాలు

జి.సిగడాం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామ దేవత చెవిటిపోలమ్మ, అసిరితల్లి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు పూజారి మక్క విజయలక్ష్మి తెలిపారు. ఏడు రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయని వివరించారు.

నవరాత్రి ఉత్సవాలకు శుభరాట


శుభరాట వేస్తున్న కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డబ్బూరి వీధి జంక్షన్ వద్ద కొలువుతీరి ఉన్న దక్షిణ కాళికాదేవి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాల శుభరాట కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు తెన్నేటి తేజేశ్వరశర్మ వేద మంత్రాల మధ్య శుభరాట వేశారు. తొమ్మిది రోజుల పాటు కాళీకాదేవి, మహాకాళి, తార, షోడశీ, భువనేశ్వరి, త్రిపురభైరవి, చిన్నమస్తా, ధూమావతి, బగళాముఖి, మాతంగి, కమాలాత్మిక, దక్షిణ కాళి అవతారాలలో భక్తులకు దర్శనమిస్తారని పెద్దలు పాలక తులసీదాస్‌రెడ్డి, కామేష్, మౌళి తెలిపారు.

కొర్లాంలో...


పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

సోంపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొర్లాం మెయిన్‌రోడ్డులో దసరా నవరాత్రులు సందర్భంగా బుధవారం శుభరాట వేశారు. పెద్దింటి సునీల్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణచంద్ర పాణిగ్రాహి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కృష్ణాపురం, విద్యానగర్, పెంటయ్య క్వార్టర్స్, దాలినాయుడు క్వార్టర్స్ ఎల్‌బీసీ ఆఫీస్ రోడ్డు, చం ద్రయ్యపేట, మెయిన్‌రోడ్డు, బాలాజీనగర్, వినాయకవీధి, పూజారిపేట, ఐజేనాయుడు కాలనీ, మోణింగివారి వీధి, కొత్తకోటవారి వీధి, గణేష్‌నగర్, పాలపోలమ్మ గుడి, మెయిన్‌రోడ్డు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కవిటిలో రేపు...

కవిటి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19న విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తెలిపారు. బొరివంక, మాణిక్యపురం, కుసుంపురం, బల్లిపుట్టుగ, దూగానపుట్టుగ, వరక పంచాయతీల పరిధిలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

లావేరులో...

లావేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేశవరాయునిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఈనెల 19న శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. ఈ కారణంగా కేశవరాయునిపాలెం, లోపెంట, మురపాక, పెదరావుపల్లి, రేగపాలేం, బయ్యన్నపేట, గుంటుకుపేట, లక్ష్మీపురం, పట్నవానిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

న్యాయాధికారిని కలిసిన న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పోక్సో న్యాయస్థానానికి న్యాయాధికారిగా నియమితులైన నక్కా సుజాత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయాధికారిని కలిసిన వారిలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు, రమణమూర్తి, వనజాక్షి, వరప్రసాద్, న్యాయవాదులు వాన కృష్ణచంద్, పేరూరి నాగేశ్వరరావు, జల్లు తిరుపతిరావు, పీవీ రమణారావు, తదితరులు ఉన్నారు.

21న నవ యువ కవితా మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వ సాహితీ కళావేదిక, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 21న శ్రీకాకుళంలో నవ యువ కవితా మహోత్సవం నిర్వహించనున్నటు సంస్థ అధ్యక్షులు భమిడిపాటి గౌరీ శంకర శాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థ ఆవరణలో ఉదయం 9 గంటలకు ఈ యువ ఉత్సవం మొదలవుతుందన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

పొందూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా ర్థినులు జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ శారదాంబ తెలిపారు. మంగళవారం జరిగిన పోటీలలో విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. అండర్ 14 విభాగంలో జామాన కావ్య, కొంచాడ రాజేశ్వరి, అండర్-17 విభాగంలో మెండ రేణుక, పోతురాజు ప్రసన్నలు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కవిటి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీం అధికారి ఎస్.సంతోష్ అన్నారు. కవిటి జూనియర్ కళాశాల, ఇద్దివానిపాలెం పాఠశాలల్లో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సు నిర్వహించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని మత్తు పదార్థాల సరఫరా జరుగుతోందన్నారు. వాటికి ఎవరూ ఆకర్షితులు కావద్దని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మన బడి' పనులు పూర్తి చేయండి

గార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పాఠశాలలతో పాటు కొత్తగా మన బడి..మన భవిష్యత్తు ద్వారా చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి కోరారు. బుధవారం ఆయన మండలంలోని అంపోలు, శ్రీకూర్మం, మత్స్యలేశం, సిగిడిపేట, కొర్ని తదితర పాఠశాలలను సందర్శించి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, మండల నాయకులు ఎం.తేజ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రాజ్యాంగబద్ధంగా పాలన లేదు'

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా పాలన సాగడం లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆక్షేపించారు. రూ.లక్ష కోట్లు ఒక రాజధానికి పెడితే తరువాత వచ్చిన ప్రభుత్వాలు అప్పుతీర్చే పనిలో ఉండాలా అంటూ ప్రశ్నించారు. బుధవారం జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చాయని... ప్రస్తుతం టీడీపీ మాత్రమే అధికారాన్ని చెలాయిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

జి.సిగడాం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో గల సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌వలస ఎంపీటీసీ సభ్యుడు కె.రమేష్ నాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. మండల సర్వసభ్య సమావేశాలకు తహసీల్దార్ గైర్హాజరవుతున్నారని.. అటువంటప్పుడు రెవెన్యూ సమస్యలపై ఎవరికి మొర పెట్టుకోవాలని ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎరువులు సకాలంతో అందించి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీను, దారబోయిన ధర్మారావు అన్నారు. దీనికి ఏవో సమాధానమిస్తూ ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని...ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకట రమణ, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, పీఏసీఎస్ చైర్మన్ బెరవ జగన్నాథరావు, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి: జేసీ


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే శక్తివంతమైన కుటుంబం సాధ్యపడుతుందని, ఇందుకు 'స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్' తోడ్పడుతుందని జా యింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య నిపుణులు నేరుగా ఇళ్లకు వచ్చి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. రొమ్ము, నోరు, గర్భాశయ క్యాన్సర్లు, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఊబకాయం వంటి వాటికి ఉచిత వైద్యం అందచేస్తారని తెలిపారు. 200 మంది మహిళలకు ఉచిత స్క్రీనింగ్, పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ జేడీ డి.నరసింగరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, ఐసీడీఎస్ పీడీ ఐ.విమల, డీసీహెచ్‌ఎస్ డా.ఎన్.కళ్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

అరసవల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యుడు గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 6 నుంచి 18 సంవత్సరాల వయసు గల దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.శశిభూషణ్ తెలిపారు. ఈ శిబిరాల్లో అర్హులైన విద్యార్థులను గుర్తిస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడిఐడీ, రేషన్/ఆదాయ ధృవపత్రం, విద్యార్థి ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. ఈ నెల 19న ఇచ్ఛాపురం, 20న పలాస/కాశీబుగ్గ, జెడ్పీహెచ్ఎస్, 22న టెక్కలి 23న పాతపట్నం, 24న శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో, 25న ఆమదాలవలస ఎంపీడీవో కార్యాలయం వద్ద, 26న నరసన్నపేట, 27న రణస్థలంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్ఐ చిరంజీవి

రణస్థలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. బుధవారం మరువాడ జడ్పీ హైస్కూల్ భోజన విరామ సమయంలో విద్యార్థులకు నారీ శక్తిపై అవగహన కల్పించారు. పదో తరగతి పరీక్షలలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.10వేలు ప్రోత్సాహం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.శివశంకర్, సిబ్బంది ఎస్.రహీం, టి.సురేష్, కె.ఖగేశ్వరరావు, బీజీ హరినాథ్, జి.చిన్నికృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో...

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు సూచించారు. బుధవారం చౌదరి సత్యనారాయణ కాలనీలో నారీశక్తి పేరిట మహిళల భద్రతపై అవగాహనా కార్య క్రమం నిర్వహించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో శక్తి యాప్, ఎస్‌వోఎస్, 112 నెంబర్ల ద్వారా సమాచారం అందించాలన్నారు.

కసింవలసలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగించిన దృశ్యం

ఆమదాలవలస, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కసింవలసలో బుధవారం అధికారులు ఆక్రమణలను తొలగించారు. సర్వే నెంబర్ 88/10లో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకొని కంచె ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీకి చెందిన ఆ ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు రావడంతో చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి తెలిపారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు శ్రీకాకుళం రెవెన్యూ సిబ్బంది, శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఆక్రమణలు తొలగించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు.

మలుపుల్లోని పొదల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోంపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రట్టి, బారువ రహదారికి ఇరువైపులా చాలా కాలంగా ఏపుగా పెరిగి రోడ్డుపైకి వచ్చిన పిచ్చిమొక్కలను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో దీనిపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రాజాం వద్ద ప్రమాదకరమైన మలుపు నుంచి సిరిమామిడి, ఎర్రముక్కాం వరకు పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించడంతో పాదచారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభం మార్చారు...

రణస్థలం, సెప్టంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేల్పురాయి గ్రామ సమీపంలో ఒక చెరువు గట్టుపై విద్యుత్ స్తంభం ఇటీవల వర్షాలకు పూర్తిగా ఒరిగిపోయింది. ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈమేరకు బుధవారం సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాన్ని సరి చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి భాద్రపద శుద్ధ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఆర్.వికాస్‌శర్మ పాల్గొన్నారు.

రక్షణ గోడను నిర్మించండి

సోంపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ కేం ద్రం చుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించి రక్షణ గోడ నిర్మించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని సిరిమామిడి సర్పంచ్‌కు సోంపేట ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. బుధవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించిన ఆమె సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

సామూహిక లలితా సహస్రనామ పారాయణం

ఆమదాలవలస, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలోని శృతి మందిరంలో బుధవారం 153 మంది మహిళలు లలితా విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, రవీంద్రబాబు, జిల్లా వైద్య ఇన్‌చార్జి డాక్టర్ తాతయ్య, తమ్మ శాంతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పర్యావరణ కార్యదర్శులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అలరించిన వాయులీన సుధార్ణవం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సునాద వినోదిని సంస్థ వ్యవస్థాపకులు మండకృష్ణ రామప్రసాద్ జయంతి సందర్భంగా కత్తెర వీధిలోని శ్రీ రాజరాజేశ్వరి సంగీత విద్యాపీఠంలో బుధవారం 'వాయులీన సుధార్ణవం' పేరుతో సంగీత కచేరి నిర్వహించారు. మండా శ్రీనివాస్ మృదంగం, సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ వాయులీనం, ఎస్.శ్రీనివాసరావు కీబోర్డుతో సహకారం అందించారు.

విద్యార్థినులకు ప్రోత్సాహకాలు


విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ కేఆర్ రజని

ఎచ్చెర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను చదువుతున్న విద్యార్థినులకు హిటాచి సంస్థ సహకారంతో శిక్షణ ఫౌండేషన్ సంస్థ అందించే ప్రోత్సాహాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరుగురు ఎంపికయ్యారు. వీరికి ల్యాప్‌టాప్‌లతో పాటు కిట్‌బ్యాగులను అందజేశారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.20 వేల వంతున అందజేయనున్నారు. ఈ విద్యార్థినులను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, టీసీడీఈ సమన్వయకర్త బి.అజయ్ కుమార్, ఈఈఈ సమన్వయకర్త డాక్టర్ టి.భవాని అభినందించారు.

ఘనంగా కన్యా సంక్రమణం పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కన్యా సంక్రమణం పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు అమ్మవారికి సిందూర మర్దన, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయంలో హోమాలు చేశారు. గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ, ముత్యాలమ్మ వీధి జంక్షన్ వద్ద గల ముత్యాలమ్మ, మండపల్లి గారపోలమ్మ అమ్మవారి ఆలయాల్లో సంక్రమణం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి 20 నుంచి 25 బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేసి వారికి లభిస్తున్న ప్రభుత్వ ప్రయోజనాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు ఆదేశించారు. ఈ పనిని ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం సీపీఓ లక్ష్మీప్రసన్న అధ్యక్షతన శిక్షణ సచివాలయ ఉద్యోగులకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 23లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.బేతనసామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి ప్రవేశానికి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి ప్రవేశానికి అర్హులని తెలిపారు.

నూతన కార్యవర్గం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడివలసలో అసిరితల్లి, నీలమ్మతల్లి గ్రామదేవతల ఆలయాల సేవా సొసైటీ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ జీవిత కాల గౌరవాధ్యక్షునిగా తంగి హరినారాయణ, అధ్యక్షులుగా చిగిలిపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులుగా కోరాడ అప్పారావు, కార్యదర్శిగా గొలివ రమణ, సంయుక్త కార్యదర్శిగా తంగి రాజారావు, కోశాధికారిగా నేతింటి సోములు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ దేవతల ఉత్సవాల నిర్వహణ, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పొందూరు ఎంపీడీవోగా వాసుదేవరావు

పొందూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.వాసుదేవరావును నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేడు మెగా వైద్యశిబిరం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద గురువారం ఉచితంగా మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి ప్రకటనలో తెలిపారు. వివిధరకాల వైద్య నిపుణులు ఈ శిబిరంలో సేవలు అందిస్తారని వివరించారు.

సిబ్బంది లేక.. శస్త్రచికిత్సలు జరగక



పాతపట్నం 50 పడకల ఆసుపత్రి

● టెక్కలి, శ్రీకాకుళం రిఫర్ చేస్తున్న వైనం ● ఇదీ పాతపట్నం సీహెచ్‌సీలో పరిస్థితి

పాతపట్నం,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సీహెచ్‌సీలో శస్త్రచికిత్సలకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో శ్రీకాకుళం, టెక్కలి రిఫర్ చేస్తున్నారు.దీంతో ఇక్కడ పూర్తిస్థాయిలో సేవలందక పోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సివస్తోందని రోగులు వాపోతున్నారు.

అప్‌గ్రేడ్ చేసినా..

పాతపట్నంలోని సామాజిక ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రిగా రెండు దశాబ్దాల కిందట అప్‌గ్రేడ్‌చేశారు.ప్రధానంగా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకాలు జరగలేదు.దీనికితోడు మారుమూలప్రాంతం కావడం, జిల్లా కేంద్రానికి ఇతరప్రాంతాలకు రాకపోకలకు వీలుగా లేకపోవడంతో ఇక్కడికి వైద్యులు రావడానికి ఆసక్తిచూపేవారు లేదు. ఇటీవల జాతీయరహదారి-326ఎ నిర్మాణం పూర్తికావడంతో వైద్యులు ఇక్కడ సేవలందించడానికి ఆసక్తి చూపుతున్నారు.

నిరాశతో వెనుదిరుగుతున్న రోగులు

వాస్తవానికి ఇక్కడ 12మంది వైద్యులు ఉండాలి.కాని తొమ్మిది మంది ఉన్నారు. ముగ్గురు ఎంబీబీఎస్, ఇద్దరు గైనకాలజిస్టులు, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆప్తాలమిస్టు, ఈఎన్‌టీ, ఆర్థో, డెంటిస్టు అవసరం.అయితే వీరిలో శస్త్రచికిత్సల నిర్వహణకు అవసరమయ్యే జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆప్తాలమిస్టు వైద్యులు ఒక్కరు కూడాలేరు. దీంతో శస్త్రచికిత్సలు జరగడం లేదు.స్థానికంగా ఉండే ప్రైవేటుఆస్పత్రులకు రోగులు ఆశ్రయించాల్సివస్తోంది.డేటా ఎంట్రీ ఆపరేటర్లు కూడాలేరు. ఇక్కడ పాతపట్నం, హిరమండలం, సారవకోట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లోని వందలాదిమంది ఆపరేషన్లకోసంవస్తుంటారు. పక్కా భవనంఉన్నా శస్త్రచికిత్సలకు అవసరమైన వైద్యులు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచివచ్చే రోగులు నిరాశతో వెనుదిరగాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది రిఫర్‌చేస్తున్నారు. దీంతో రిఫరల్ ఆస్పత్రిగా మారిపోయిందని విమర్శలొస్తున్నాయి. కాగా శస్త్రచికిత్సల నిర్వహణకు వైద్యుల కొరతఉందని పాతపట్నం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గిడుతూరి వేణుగోపాలరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సోంపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలసకు చెందిన రైతు పీతాంబరం ఈశ్వరరావు (45) పొలంలో విద్యుదాఘాతానికి గురై బుధవారంసాయంత్రం మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న సోంపేట సీఐ మంగరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులతో మాట్లాడారు.సీఐ కథనం మేరకు..పొలంలో ఉన్న విద్యుత్ బోరు వేసేందుకు స్విచ్ వేయగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న ఈశ్వరరావును గ్రామస్థులు 108లో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈశ్వరరావుభార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఈశ్వరరావు మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు బారువ పోలీసులు కేసునమోదు చేశారు.

రైలు ఢీకొని 37 గొర్రెలు..

కంచిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) కంచిలి రైల్వే ఫై ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం రైలు ఢీకొని 37 గొర్రెలు మృతి చెందాయి. భొగాబెణి పంచాయతీ పరిధిలోగల జెన్నాఘయి గ్రామానికి చెందిన ఇప్పిలి చిన్నారావు ట్రాక్ దాటిస్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొంది. గొర్రెలు మృతిచెందడంతో తనకు జీవనాధారం పోయిందని వాపోయాడు.

11కేజీల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని.. ఇద్దరిని అరెస్ట్ చేశారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు వెల్లడించారు. తమిళనాడులోని తుత్తుకొడి జిల్లాకు చెందిన కందశివ ముత్తుకుమార్, కపిల్‌దేవ్‌మరియప్పన్ గంజాయి వ్యాపారం చేయడానికి నిశ్చయించుకున్నారు. ఈ మేరకు వీరికి పరిచయమైన గంజాయి వ్యాపారి, ఒడిశా రాష్ట్రానికి చెందిన మణిక్ సభర్ వద్దకు వెళ్లి 11 కేజీల 120 గ్రాముల గంజాయిని కేజీ రూ.మూడువేల చొప్పున కొనుగోలు చేశారు. దీనిని తీసుకొని బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. గంజాయిని తమిళనాడుకు తరలించేందుకు రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు బయలుదేరారు. ఎం.తోటూరు సమీపంలో గల రైల్వే ఎల్‌సీ గేటు వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు.గంజాయిని స్వాధీనం చేసుకొని.. నిందితులను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

శ్రీకాకుళంక్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సుడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఆటోడ్రైవర్‌పై శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..శ్రీకాకుళంలోని బలగకు చెందిన చిట్టిరాజు శ్రీకాకుళం ఆర్టీసీ లీజు బస్సుకు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బత్తిలి వెళ్లేందుకు ప్రయాణికులను ఎక్కించుకొని బయలుదేరారు. ఉదయం 8 గంటలకు బస్సు బలగ జంక్షన్‌కు చేరుకుంది. బస్సు ముందు ఉన్న ఏపీ ఆటో స్పీడ్‌బ్రేకర్ ఎక్కించలేక ఒక్కసారిగా వెనక్కి వచ్చింది. వెనుక ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ తన ఆటోను ఢీకొన్నాడన్న ఉద్దేశంతో అతనిపై ఆటో డ్రైవర్ ఎండపల్లి వసంతరావు దాడిచేశాడు. ఈ మేరకు ఆర్టీసీ డ్రైవర్ చిట్టిరాజు ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు ఆటో డ్రైవర్ వసంతరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలు

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని పోలాకి రోడ్డులోగల దేశవానిపేట శివారులో బుధవారం ఆటోబోల్తాపడింది. దీంతో చీడివలసకు చెందిన కాలజ్యోతితోపాటు మరోఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. చీడివలస నుంచి కాలజ్యోతి తన భర్తతో కలిసి ఆటోలో పోలాకివెళ్తోంది.దేశవానిపేట వద్ద అదుపు తప్పి ఆటోబోల్తాపడింది. దీంతో జ్యోతికి బలమైన గాయాలుకావడంతో శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రికితరలించారు.జ్యోతిభర్త, ఆటోడ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి.

'ఆదికర్మ యోగి'తో గిరిజనులకు భరోసా

హరిపురం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మ యోగి కార్యక్రమంతో గిరిజనులకు భరోసా లభిస్తుందని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు.బుధవారం మందస మండలంలోని కుసుమాల పంచాయతీ బంసుగాం గిరిజన గ్రామంలో గ్రామ సభ నిర్వహిచారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అన్నదొర, ఎంపీడీవో తిరుమలకుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్త్రీశక్తి పథకంతో వీధినపడిన తమకు ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో వివిధ ఆటోస్టాండ్ల వద్ద ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో పి.ఉమా, యు.శ్రీనివాసరావు, జి.వెంకటేష్, డి. రమేష్, కె. చిరంజీవి, కర్రి ఢిల్లీశ్వరరావు, పూతి రాంబాబు, బాల సుబ్బారావు పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థపై దృష్టి సారించాలి

హిరమండలం,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):రెవెన్యూవ్యవస్థ గాడిలో పెట్టడంపై తహసీల్దార్ దృష్టిపెట్టాలని జడ్పీటీసీసభ్యుడు పి.బుచ్చిబాబు కోరారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన సాధారణసమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వీఆర్వోలు పనితీరు దారుణంగా ఉందని, వారి విధానం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ఉందన్నారు. ప్రభుత్వంనుంచి మండలానికి ఎరువులు మంజూరు విషయంలో అధికారులు తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్ల రైతులకు సరిపడి యూరియా అందడంలేదని పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ళ సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు తీరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణ,ఎంపీడీవో కాళీప్రసాదరావు ఎంపీటీసీ,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డిపాజిటర్ ఎడ్యుకేషన్‌పై వర్క్‌షాపు

టెక్కలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్‌పై వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు బ్యాంకింగ్ వ్యవస్థపై వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పీడీ ఆంజనేయులు, మేనేజర్ అశోక్‌కుమార్, నాగరాజు, శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, హరిబాబు, హరినాథ్, శివకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాశీబుగ్గ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తేనే విజయం సాధించగలరని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎంహెచ్‌కే ప్రసాద్ తెలిపారు. బుధవారం కాశీబుగ్గలోని శ్రీవిద్యావాహిని డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పాతపట్నం సబ్‌ట్రెజరీ అధికారి పి.మన్మథరావు, సాయివినీత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవితంలో అన్ని తట్టుకొని ముందుకువెళ్లాలని, ఒత్తిడిని ఎదుర్కొని విజయాలు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అయిదం గిరిబాబు, కరస్పాండెంట్ పైల తిరుమలరావు, డైరెక్టర్లు సంధ్యారాణి, మన్మథరావు, ఏవో ఖగేశ్వరరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల నిరసన


వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి యూరియాకోసం రైతులు నిరసన తెలిపారు. ఎరువుల షాపుల వద్ద యూరియా అందజేస్తామని సోమవారం వ్యవసాయాధికారులు టోకెన్లు ఇచ్చారు. దీంతో రైతులు బుధవారం టోకెన్లతో కోటబొమ్మాళిలోని ఎరువుల షాపుల వద్దకు చేరుకున్నారు. యూరియా లేదని షాపుల నిర్వాహకులు తెలియజేయడంతో రైతులు వ్యవసాయకార్యాలయం వద్దకు చేరుకున్నారు.కార్యాలయంలో మూసివేయడంతో రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడకు పోలీసులు చేరుకుని ఏవో గోవిందరావుతో ఫోన్‌లో మాట్లాడారు. కోటబొమ్మాళిలో షాపులకు యూరియా వచ్చిందని, సరఫరా చేయడానికి కోడ్‌రాకపోవడంతో గురువారం టోకెన్‌ఉన్న ప్రతి రైతుకు అందజేస్తామని ఏవో తెలిపారు. ఈవిషయం రైతులకు పోలీసులు తెలియజేసి అక్కడ నుంచి పంపించివేశారు.

● పాతపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని శార్వాయ ఎంటర్‌ప్రైజెస్, రమేష్ అండ్ సురేష్‌ట్రేడర్స్ షాపుల్లో పోలీస్ పహర మధ్య యూరియాను బుధవారం పంపిణీచేశారు.అధికారులు గ్రామాల్లో ఇచ్చిన టోకెన్లప్రాప్తికి దుకాణాల్లో యూరియా పంపిణీ చేపట్టగా రైతులు బారులుతీరారు.రెండుషాపుల్లో 1100ల యూరియా బస్తాలను పంపిణీ చేపడుతున్నట్లు ఏవో కిరణవాణి తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్) ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, బోధన కళాశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకుడు రాంబాబు కోరారు.ఈ మేరకు అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు సమస్యలను వివరించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తపాలా సేవలపై అవగాహన

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస సబ్‌డివిజన్ తపాలాశాఖ ఏఎస్పీ శ్రవణ్ కుమార్ కోరారు. బుధవారం లక్ష్మీనర్సుపేటజంక్షన్‌లో బుధవారం ఇంటింటికి వెళి తపాలాశాఖ ద్వారా అందజేస్తున్న సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు.

'ఆటోమిత్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఆటోమిత్ర పథకానికి ఈనెల 19వ తేదీలోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కాళీప్రసాదరావు ఒకప్రకటనలో తెలిపారు. ఆటోకు సంబంధించి ఏపీ రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఎల్ లింకు ఖచ్చితంగా ఉండాలని తెలిపారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

పాతపట్నంరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):బైదలాపురం ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండాలని బుధవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగామాట్లాడుతూ కొంతకాలంగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యం అందడంలేదని ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి సిబ్బంది పనితీరు మార్చుకోవాలి: పీడీ

జలుమూరు (సారవకోట) సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామి సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని డుమా పీడీ బి.సుధాకరరావు హెచ్చరించారు. బుధవారం సారవకోట మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలు ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారులు సంతకం లేకుండా బిల్లులు ఏ విదంగా చెల్లించారని మండిపడ్డారు. గత ఏడాది జరిగిన ఉపాధి పనుల్లో నాలుగు లక్షలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో బయట పడిందన్నారు. దీనికి ఏపీవోతో పాటు ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతవహించాలన్నారు.జిల్లావిజిలెన్స్ అధికారి బి.లవరాజు,ఏపీడీలు లోకేష్, పి.రాధ, ఎంపీడీవో మోహనకుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రహదారి: ఎంజీఆర్

కొత్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారి సదుపాయం కల్పిస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం గొట్ట నివగాం వయా గులుమూరు, కడుము గ్రామాల రహదారి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో రహదారులకు తట్టెడి మట్టి కూడా వేయలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరావు, తులసీవరప్రసాద్ పాల్గొన్నారు

పేదలకు ఇళ్ల స్థలాలు: కమిషనర్

పలాస,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):పట్టణప్రాంతంలో ఇళ్లులేని పేదలకు సొంత ఇంటి కోసం పీఎంఏవై పథకం కింద రెండు సెంట్లు స్థలాన్ని కేటాయించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. బుధవారం జంటపట్టణాల్లో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో పీఎంఏవై అంగీకార్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూపీఎంఏవై పథకం కింద వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి సహాయం చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికలు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం టెక్కలి డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 జిల్లాస్థాయి ఆటల పోటీలకోసం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. పదిమండలాల్లోని 40 పాఠశాలల నుంచి 378 మంది క్రీడాకారులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈవో జలుమూరు చిన్నవాడు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగన్న, భాస్కరరావు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు


రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న పద్మజీకామేశ్వరరావు

కాశీబుగ్గ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని సూర్యతేజ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ దానేటి పద్మజీకామేశ్వరరావు తెలిపారు.బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల సూర్యతేజ కళాశాలలో రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమం పద్మజీకామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో ప్రాణదాత బ్లడ్‌బ్యాంక్ సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు వజ్జ మురళి, కె.చిరంజీవులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వజ్రపుకొత్తూరు : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రిచర్డ్‌బూన్, ఆయూష్ వైద్యాధికారి జిన్‌పణిమాధవి తెలిపారు.బుధవారం డోకులపాడులో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశిబిరం నిర్వహించి మహిళలు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది జి.ఈశ్వరమ్మ,చక్రధర్, టి.లక్ష్మి, ఎన్.శ్రావణసంధ్య, ఎస్.జ్యోతి, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, నాయకులు వడ్డి కరుణాకర్ పాల్గొన్నారు.

కరవంజలో వైద్యశిబిరం

జలుమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరవంజ గ్రామ సచివాలయంలో స్వస్తి నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకం కింద బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జలుమూరు వైద్యాధికారి గొలివి సుజాత పాల్గొన్నారు. అలాగే సైరిగాం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి గురునాధరావు నేతృత్వంలో తిమడాంలో మహిళలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిసంధ్యారాణి, హేమలత, సీహెచ్‌వో పద్మావతి, ఆరోగ్యవిస్తరణాధికారులు చిన్నరాజులు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

పోలాకి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ చేసిన వారికి గ్యాడ్యుటీ, 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు కోరారు.పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ అసైన్‌మెంట్‌పుస్తకాల నిర్వహణ, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు.

దేవీ నవరాత్రుల ఉత్సవాలకు పందిరి రాట

సంతబొమ్మాళి,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెట్లతాండ్రలో దేవీనవరాత్రుల ఉత్సవాలకు బుధవారం పందిరిరాట వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగ అశిరినాయుడు,పంగ నర్సింహమూర్తి గ్రామస్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి

కొత్తూరు/హిరమండలం,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీవీఈవో ఆర్.సురేష్‌కుమార్ కోరారు. బుధవారం కొత్తూరు, హిరమండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరిశీలించారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ జి.ధనుంజయరావు ఉన్నారు.

టెక్కలిలో రక్తదాన శిబిరం

టెక్కలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి ప్రభుత్వడిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్‌ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరంఏర్పాటుచేశారు.కార్యక్రమంలో జిల్లా కేంద్రాసుపత్రి బ్లడ్‌బ్యాంక్ వైద్యులు సునీత, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, సతీష్, లూక్‌పాల్, వాసుబాబు, గొల్ల, రెడ్‌రిబ్బన్ కో-ఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల కోసం 22న ఎంపికలు

టెక్కలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు పంపిణీకి అర్హులైన విద్యార్థులను గుర్తించేందుకు ఈనెల 22న టెక్కలిలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల అర్హత నిర్ధారణ కోసం ధ్రువపత్రాలతో హాజరుకావాలని వారు కోరారు.

22న వైద్యశిబిరం

నరసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వంద పడకల ఆసుపత్రి ప్రాంగణంలో స్వస్తనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించనున్నటు సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీపీ, మధుమేహం, నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ తదితర వ్యాధులకు పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డీడీవోగా శైలజ

పలాసరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా(డీడీవో) బొడ్డేపల్లి శైలజ నియమితులయ్యారు.శ్రీకాకుళం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆమె పదోన్నతిగా వచ్చారు. ఈమేరకు పలాస ఉపాధి కార్యాలయం వద్ద డీడీవోగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీవోల నియామకం

టెక్కలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎంపీడీవోగా ఎం.రేణుక బుధవారం బాధ్యతలు చేపట్టారు. నరసన్నపేటలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై టెక్కలి బదిలీపై వచ్చారు. ఇక్కడ చింతాడ లక్ష్మీభాయి పదవీవిరమణ తర్వాత ఎఫ్ఏసీ ఎంపీడీవోగా కె.ఫణీంద్రకుమార్ ఇప్పటివరకు బాధ్యతలు చేపట్టారు.

●జలుమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జలుమూరు ఎంపీడీవోగా బి.చిన్నమ్మడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన అప్పలనాయుడు పదవీ విరమణ చేయడంతో సారవకోట మండలపరిషత్ ఏవోగా పనిచేస్తున్న చిన్నమ్మడు పదోన్నతిపై ఎంపీడీవోగా నియమితులయ్యారు.

●పాతపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎంపీడీవోగా హెచ్‌వీ రమణమూర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వచ్చారు.

ఎస్ఐగా మధుసూదనరావు

పాతపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎస్ఐగా కె. మధుసూదనరావు బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటివరకూ ఎస్ఐగా పనిచేస్తున్న బి.లావణ్య బదిలీపై వెళ్లారు.

బీసీల అభివృద్ధికి కృషి

హరిపురం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి):బీసీల ఆర్థిక అభివృద్ధికి కృషిచేస్తానని ఏపీ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు తెలిపారు. కొత్తపేటలో తాతారావును సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తవిటయ్య, సోమేశ్వరరావు, దుర్యోధన, జగన్నాయకులు, సింహాచలం పాల్గొన్నారు.


రణస్థలం: ఎంపీ కలిశెట్టికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


పాతపట్నం: కేక్‌కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


గార: కె.మత్స్యలేశంలో మహిళకు దుస్తులు పంపిణీచేస్తున్న నాయకులు

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

ప్రధాని నరేంద్రమోదీ జన్మదినవేడుకలు బుధవారం బీజేపీ, కూటమి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజలు చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

●రణస్థలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా 116 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు, శివ్వాన ఉమామహేశ్వరి, విజయానందరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి రజినిఎన్ఈఆర్, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, చౌదరి బాబ్జి, ముప్పిడి సరేష్, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, రౌతు శ్రీను, వడ్డాది శ్రీను పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, సర్వజనాసుపత్రి వైద్యశాల రక్తనిధి కేంద్రం, వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన అమృత మహోత్సవ్-2 కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లుఎస్.ఉదయభాస్కర్, అనూరాధ, రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ, చైతన్యకుమార్ పాల్గొన్నారు.

●పాతపట్నం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోదీ జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేశారు.

●గార, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):కె.మత్స్యలేశంలో బీజేపీ నాయకులు మైలపల్లి జనార్దనరావు, పండి యోగేశ్వరరావు, రవిబాబ్జీ, ఆ పార్టీ మండలాధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీజనార్దన్,నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

● సోంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సోంపేటలోని లోకనాథేశ్వరాలయంలో బీజేపీ నాయకులు 108 కొబ్బరికాయలతో పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బీన వంశీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, కూటమి నాయకులు మద్దిల నాగేశ్వరరావు, బీన ఆనంద్, పూనా పాండురంగ, టి.విజయ్‌కుమార్, కొంచాడ రవిప్రసాద్, తెప్పల కృష్ణారావు, పూనా ప్రసాద్ ఉన్నారు.

● శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి గుజ్జల రాజు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అప్పలరాజు, సూరపునాయుడు, అట్టాడరవిబాబ్జీ, సూర్యకుమారి, అప్పారావు, రాజేశ్వరి, రెడ్డి నారాయణరావు, కిరణ్, తవుడు,అప్పారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.